క్లుప్తంగా

మార్కెట్‌లో రాఖీల సందడి



బలిజిపేట మార్కెట్‌లో రాఖీలు కొంటున్న చిన్నారులు



పార్వతీపురం: పట్టణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

బలిజిపేట: రాఖీ వేడుకకు చిన్నారులు, పెద్దలు సిద్ధమవుతున్నారు. శనివారం రాఖీ పూర్ణిమ కావడంతో మార్కెట్‌లో రాఖీలు కొనుగోలు చేసి చిన్నారులు, పెద్దలు వారి సోదరులకు ప్రేమతో కట్టి వారినుంచి ఆశీస్సులు పొందుతారు. ఇది రక్షాబంధనంగా సోదరులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. తన చేతికి రాఖీ కట్టిన చెల్లెమ్మకు కానుకలు ఇచ్చి సంతృప్తి చెందుతారు. అందుకు అవసరమైన రాఖీలను మార్కెట్‌లలో రకరకాల డిజైన్లలో విక్రయిస్తున్నారు. వాటిని పెద్దలు, చిన్నారులు కొనుగోలు చేస్తున్నారు.

జమ్ము అప్పారావుకు పరామర్శ



జమ్ము అప్పారావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: పాచిపెంట మండలం పి.కోనవలస మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్ము అప్పారావును మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పరామర్శించారు. ఈ మేరకు శుక్రవారం అప్పారావు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన తీసుకుంటున్న చికిత్స తదితర అంశాలపై ఆరా తీసి, పలు ఆరోగ్య చిట్కాలు తెలిపారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు కంట రక్తపు చుక్కలు

- కరుణ చూపని వరుణుడు
- 5వేల ఎకరాల్లో పూర్తికాని ఉభాలు
- సాధారణ వర్షపాతం కన్నా తక్కువ నమోదు
- ఆవేదనలో రైతులు



పెదంకలాం కాలువ

బలిజిపేట:

తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతుండడంతో ఖరీఫ్‌లో వరిపంట ఉభాలు పూర్తికాక రైతులు లబోదిబో మంటున్నారు. బలిజిపేట మండలంలో పెదంకలాం కాలువ దిగువన 5వేల ఎకరాల విస్తీర్ణంలో ఉభాలు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై, ఆగస్టులో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షం పడడంతో ఉభాలు జరిగిన విస్తీర్ణం, వెదలు వేసిన పంట భూములకు సాగునీటి కొరత ఏర్పడింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. సాగునీటి సమస్య ఒకవైపు పీడిస్తుంటే ఎరువుల కొరత దానికి తోడవడంతో కళ్లవెంట రక్తపు చుక్కలు రాలుతున్నాయంటూ రైతులు రోదిస్తున్నారు. గడిచిన 15రోజులకు పైగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం, వర్షం కురవకపోవడంతో నారుమడులు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఉభాలు చేసిన భూములు, వెదలు జల్లిన వర్షాధార పంటభూములకు సాగునీరు అందడం లేదని వాపోతున్నారు. పంటపొలాలు బీటలువారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదంకలాం కాలువ నీరు నేటికీ రాకపోవడంతో కాలువ దిగువన ఉన్న భూముల్లో ఉభాలు జరగకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందని, ఇంతటి దారుణమైన పరిస్థితులను ఇప్పటివరకు చూడలేదని రైతులు చెబుతున్నారు. కాలువ దిగువన ముందుగా ఉభాలు జరిగేవని ఈ సంవత్సరం ఇప్పటివరకు కాలువనీరు రాకపోవడంతో ఉభాలు చేయలేకపోతున్నామని చెబుతున్నారు. ఒకవైపు నారుమడులు ఎండిపోతున్నాయని, పంటకు సిద్ధం చేయాల్సిన భూములు బీడుభూముల్లా ఉన్నాయని వాటిలో మేకలను, గొర్రెలను, పశువులను మేపుతున్నారని అంటున్నారు. తీవ్ర వర్షాభావం, కాలువ నీరు రాకపోవడం వంటి విపత్కర పరిస్థితులు రైతులను నట్టేట ముంచి వ్యవసాయానికి దూరం చేస్తున్నాయని వాపోతున్నారు.

కాలువనీరు రాకపోవడం దారుణం

పెదంకలాం కాలువ నీరు ఇప్పటికీ రాకపోవడంతో ఉభాలు జరగడం లేదు. ఈ సంవత్సరం అంత దారుణం గతంలో చూడలేదు. చాలావరకు ఉభాలు జరగక పొలాలు ఎండిపోయాయి, అయిన వాటికి నీరు లేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరుణుడు చిన్నచూపు చూశాడు.

– కూర్మినాయుడు, రైతు, బలిజిపేట



బీడుభూముల్లో మేస్తున్న గొర్రెలు



ఎండిపోయిన నారుమడి

మండలంలో ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం **18**వేల ఎకరాలు
పూర్తయిన వెదలు **7,125**ఎకరాలు
పూర్తయిన ఉభాలు **6**వేల ఎకరాలు
ఉభాలు జరగని విస్తీర్ణం **5**వేల ఎకరాలకు పైగా ఉంది.

వర్షపాత నమోదు వివరాలు

వర్షపాతం జూలై, ఆగస్టు నెలల్లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదైంది. జూన్‌లో కురిసిన వర్షపాతం వల్ల చెరువులు, బావులు, గుంటలు అంతగా నిండకపోవడంతో సాగునీటి సమస్య ఎదురైంది.

నెల	పడాల్సిన వర్షపాతం (మి.మీటర్లు)	పడిన వర్షపాతం (మి.మీటర్లు)
జూన్	119.3	129.2
జూలై	182.2	162.6

ఆగస్టు 1వ తేదీ నుంచి ఇప్పటివరకు పడాల్సిన సాధారణవర్షం 46.4మిల్లీ మీటర్లు కాగా ఇప్పటికి పడింది 8.7మిల్లీమీటర్లు మాత్రమే.

రావమ్మా..మహాలక్ష్మీ..రావమ్మా..



బలిజిపేట: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



పార్వతీపురం టౌన్: బెలగాం దుర్గమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పూజారి



సాలూరు: వెండి చీరలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి



పార్వతీపురం టౌన్: శ్రీవిద్యా సర్వమంగళా దేవి పీఠం వద్ద దుర్గమ్మ వారు

- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

సీతానగరం: వరలక్ష్మి అమ్మవారికి ప్రీతికరమైన శ్రావణ శుక్రవారం మూడవవారం ఆలయాల్లోను, ప్రతి ఇంట్లో వరలక్ష్మి వ్రతాలు ఘనంగా భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ నేపథ్యంలో పార్వతీపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రామాలయాలు, శివాలయాల్లో పూజలు నిర్వహించేందుకు శుక్రవారం వేకువజామునుంచి అమ్మవారికి ప్రీతికరమైన వివిధ రకాల పళ్లు, పుష్పాలు, ప్రసాదాలు, వివిధ రకాల వంటకాలు తయారు చేసి కలశాలతో భక్తులు పాల్గొన్నారు. గుచ్చిమిలో గృహాల్లో మంటపాలు తయారు చేసి పూజలు చేశారు. మరిపివలస శివాలయం, స్థానిక వేణు గోపాలస్వామి ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి.



సీతానగరం: గుచ్చిమిలో వరలక్ష్మి అమ్మవారి కథను వినిపిస్తున్న డాక్టర్ షర్మిల కుటుంబీకులు



సీతానగరం: వేణుగోపాలస్వామి ఆలయంలో పూజా సామగ్రితో పాల్గొన్న భక్తులు



సాలూరు: బంగారు చీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారు



పార్వతీపురం రూరల్: సంగంవలసలో వాయినాలను సమర్పించుకుంటున్న మహిళలు



శ్యామలగౌరీపురంలో అష్టలక్ష్మి ఆలయం వద్ద సామూహిక పూజలుచేస్తున్న భక్తులు

ఉచిత బస్సుతో గొడవలు

పార్వతీపురం రూరల్: ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అంటూ ఇటీవల ప్రకటన చేసింది. అయితే దీనిపై అనేక విధాలుగా వాగ్వివాదాలు, గొడవలు జరిగేందుకు ఆస్కారం ఉందని సీపీఎం నాయకుడు పి.రాము అభిప్రాయం వ్యక్తం చేశారు. భార్య ఉచిత బస్సులో ప్రయాణం చేస్తే భర్త ఏ బస్సులో ప్రయాణం చేయాలో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ భర్త అయినా ఇతర ప్రాంతాలకు ప్రయాణించేటప్పుడు భార్య పక్కన కూర్చుని ప్రయాణిస్తాడని, ఈ ఉచిత బస్సుతో అనేక వివాదాలకు ఆస్కారం ఉందన్నారు. గిరిజనులు అనేక విధాలుగా మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతుంటే కనీస స్థాయిలో దృష్టిసారించని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమై ఈ విధంగా కాలయాపన చేస్తోందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన మండలంలోని తాన్నవలస, తొక్కుడువలస, సీతంపేట పలు గిరిజన గ్రామాలను శుక్రవారం సందర్శించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్థానిక గిరిజనులతో ఆరాతీశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు, స్థానిక గ్రామస్తులు ఉన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు పి.రాము

నులి పురుగుల నివారణ మాత్రలు వేయడానికి సిద్ధం

సీతానగరం: మండలంలోని అన్ని పాఠశాలలు, గ్రామాల్లో నులిపురుగుల నివారణ మాత్రలు సామూహికంగా ఈనెల 12 వ తేదీన వేయడానికి సిబ్బందిని అప్రమత్తం చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి. ఉషారాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో అధికార సిబ్బందితో నులిపురుగులనివారణ మాత్రలు వేయడంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మండలంలో కలెక్టర్, డీఎంహెచ్‌ఓ సూచనల మేరకు సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలు, గ్రామాల్లో చిన్నారులకు ఉపాధ్యాయుల పర్యవేక్షణ, పిల్లలతల్లిదండ్రుల పర్యవేక్షణలో మాత్రలు వేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

మందకృష్ణ సభను విజయవంతం చేయండి

పాచిపెంట: ఈనెల 27వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మందకృష్ణ మాదిగ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బోను మన్మథరావు మాదిగ కోరారు. ఈ మేరకు పాచిపెంట మండలంలోని చెరుకుపల్లి, పాచిపెంట, తోటవలస, అమ్మవలస, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగి, మాదిగలకు న్యాయం జరిగిందన్నారు. ప్రతి మాదిగ సోదరుడు కూడా పార్వతీపురంలో నిర్వహించే బహిరంగ సభకు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

ఫేస్‌ఏప్‌తో అంగనవాడీలకు తిప్పలు



కొలియా గ్రామాల్లో ఫేస్ ఏప్‌లో బాలింతల హాజరు తీసుకుంటున్న అంగనవాడీ కార్యకర్త

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన ఫేస్ ఏప్ విధానంతో అంగనవాడీ కార్యకర్తలతో పాటు బాలింతలు గర్భిణులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక గర్భిణులు, బాలింతలను ఆ గ్రామ పరిధిలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ వచ్చే ఎత్తైన ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ వారికి ఫేస్ ఏప్ హాజరు తీసుకోవాల్సి వస్తోంది. ఈ విధానంతో మైదాన ప్రాంత వాసులకు ఇబ్బందులు లేకపోయినప్పటికీ ఏజెన్సీ వాసులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. .

ఈఎన్‌సీ శ్రీనివాసరావుపై కేసులు రద్దు

- జీఓ ఇచ్చిన మంత్రులు, అధికారులపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న న్యాయవాది రేగు మహేశ్వరరావు

సాలూరు: ఏసీబీ అధికారులకు చిక్కిన ఈఎన్‌సీ(ఎన్విరాన్‌మెంటల్ నాయిస్ కేన్సిలేషన్ ఎఫ్ఏసీ) శ్రీనివాసరావు వెనుక ఉన్న అవినీతి తిమింగలాలెవరో సమగ్ర దర్యాప్తు నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిగ్గుతేల్చాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల న్యాయసలహాదారు, న్యాయవాది రేగు మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పనిచేసిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను మార్చిన చంద్రబాబు నాయుడు, ఈ అవినీతి ఈఎన్‌సీని ఎందుకు కొనసాగించాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో మూడుసార్లు ఏసీబీకి చిక్కిన ఆయనపై ఉన్న కేసులను ఈ ప్రభుత్వం తీసివేస్తూ, ఇటీవల జూలై 31న జీఓ ఇచ్చిందని గుర్తుచేస్తూ , ఇటువంటి అవినీతి అధికారిని ప్రభుత్వం ఎందుకు వెనకేసుకు వచ్చిందో తెలపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాసులకు కక్కుర్తిపడిన నేతలు, అధికారుల గుట్టు విప్పాలన్నారు. గత నెలాఖరున ఆయనపై ఉన్న అన్ని కేసులు రద్దు చేస్తూ ప్రభుత్వం జీఓలు ఇచ్చిందని, ఆయనపై ఉన్న గత కేసులు రద్దు చేస్తూ జీఓ ఇచ్చిన సంబంధిత అధికారులు, మంత్రులపై కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన నాయకుడు లచ్చయ్య పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

మక్కువ: వీఆర్‌ఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రం మక్కువలో మండల వీఆర్‌ఏల సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అమలు చేయాలని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని ప్రకటించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వీఆర్‌ఏల వేతనాలను పెంచాలని కోరారు. వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 12, 14వ తేదీల్లో పాలకొండ పట్టణంలో జరిగే సీఐటీయూ మహాసభల్లో వీఆర్‌ఏలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల వీఆర్‌ఏల సంఘం ఎన్నికలు నిర్వహించగా వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడిగా జి.పవన్ కల్యాణ్, ఉప అధ్యక్షుడిగా డి.సింహాచలం, కార్యదర్శిగా కె.సింహాచలం, కోశాధికారిగా బి.పార్వతి ఎన్నికయ్యారు.